క్లుప్తంగా

120 మందికి వైద్య సేవలు



చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరాన్ని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు ప్రారంభించి మాట్లాడారు. న్యాయవాదులు, న్యాయవాది గుమాస్తాలు, న్యాయశాఖ సిబ్బంది విధి నిర్వహణలో ఎంతో ఒత్తిడికి గురవుతారని, వారు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చెప్పారు. వైద్యులు తోట వీరేంద్ర నాథ్, కిరణ్, సాహితీ వైద్య సేవలందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చీలి ముసలయ్య, తుంగల హరిబాబు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో తనిఖీలు

మోపిదేవి: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర ఫిల్లింగ్ స్టేషన్‌లో తూనికలు, కొలతల అధికారితో కలిసి తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. వినియోగదారులకు అందిస్తున్న సౌకర్యాలు, తూనికలను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పాత మిషన్లు తొలగించి కొత్త మిషన్ ఏర్పాటు చేస్తున్నామని బంక్ యజమాని తెలిపారు. కస్టమర్ల నుంచి ఎలాంటి విమర్శలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పలు సూచనలు చేసినట్లు తహసీల్దార్ వివరించారు.

ఆర్థిక సాయం అందజేత

గూడూరు: గూడూరులో కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తూ సోమవారం మృతిచెందిన దాసరి దుర్గారావు కుటుంబానికి దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గారావు మట్టిఖర్చులకు తనవంతుగా ఈ సాయం అందించానని చెప్పారు.

వసతి గృహ సౌకర్యం కల్పించాలని వినతి

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని విద్యార్థిని, విద్యార్థులకు వసతిగృహ సౌకర్యం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు సోమవారం విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రామ్మోహనరావుకు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. సంఘ నాయకులు తోట బాబు, యు. సందీప్, కోమటి శ్రీను, చేబోయిన కోటేశ్వరరావు, పుట్టి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉత్సవ మూర్తుల ఏర్పాటు

పెడన: ఉరివి గ్రామంలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో కొత్త ఉత్సవ మూర్తులను ఏర్పాటుచేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణను వేద పండితులచే నిర్వహించగా బాయిరెడ్డి వెంకటస్వామి కుమారుడు నాంచారయ్య ఉత్సవ విగ్రహాలను అందించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోన భూషయ్య, ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్టోరేజ్ ఫ్రిజ్‌లు వితరణ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి చీరాలకు చెందిన భక్తులు చాట్రాసి రాజేష్, స్వాతి దంపతులు రూ. 60 వేలు విలువగల స్టోరేజ్ ఫ్రిజ్‌లను సోమవారం అందజేశారు. ఆలయ అర్చకులు మణిదీప్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారి చెన్నకేశవ పాల్గొన్నారు.

16 నుంచి కల్యాణోత్సవాలు

గూడూరు: దాదాపు 300 ఏళ్ల చరిత్ర కలిగిన గూడూరులోని గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి తిక్కిశెట్టి వీర వెంకట మోహనరావు తెలిపారు. గురువారం స్వామి వారిని పెండ్లి కుమారుడిని, అమ్మవారిని పెండ్లి కుమార్తెను చేస్తారు. 17న అమ్మవారికి కుంకుమ పూజలు, 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగజ్యోతి, స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. 19న రథోత్సవం, 20న ధ్వజారోహణ ద్వాదశ ప్రదక్షిణలు, స్వామి వారికి పుష్పయాగం, పవళింపు సేవ నిర్వహిస్తామని వివరించారు.

భూముల రీ సర్వే ప్రారంభం

తోట్లవల్లూరు: భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. జగనన్న సమగ్ర భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని గరికపర్రు, కనకవల్లి గ్రామాల్లో డ్రోన్ ఫ్లై కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రెండు గ్రామాల్లో సుమారు 1,222 ఎకరాల్లో అధికారులు డ్రోన్ ఫ్లై నిర్వహించారు. డ్రోన్ ఫ్లై మ్యాప్‌లు రాగానే క్షేత్రస్థాయి సర్వే జరుగుతుందని, దీనికి ప్రతి రైతు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ చెప్పారు. కుమ్మమూరు, యాకమూరు గ్రామాలలో మంగళవారం డ్రోన్ ఫ్లై కార్యక్రమం జరుగుతుందన్నారు. సర్పంచ్‌లు వీరంకి రమాదేవి, పీవీ నరసింహాశర్మ, ఎంపీటీసీలు మరీదు వెంకటశివమధుబాబు, నర్రా అప్పారావు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం జగన్

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- రూ. 1.09 కోట్లతో జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన



మోపిదేవిలో బ్యాంక్ కార్యాలయ భవన నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నాగేశ్వరరావు

మోపిదేవి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పలు పథకాలు అమలు చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవిలో రూ. 1.09 కోట్లతో జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంక్ భవన నిర్మాణానికి, రావివారిపాలెంలో రూ. 75 లక్షలతో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల మల్టీపర్పస్ గోడౌన్ భవన నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. మోపిదేవిలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమాశంలో ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టామన్నారు. డ్వాక్రా మహిళలకు రుణాలు, విదేశీ రుణాలతో పాటు డిపాజిట్ల సేకరణతో బ్యాంకు సేవలు పెంచాలని సూచించారు. ముఖ్యమంత్రి జగనన్న రైతులను ఆదుకునేందుకు రంగుమారిన ధాన్యానికి రూ. 900 నుంచి 1,100లకు మద్దతు ధర పెంచారని తెలిపారు. దివిసీమ వాసులకు ఇబ్బంది లేకుండా చుక్కల భూముల సమస్య పరిష్కరించడంతో ఇప్పుడు ఆ భూములపై రైతులు సంపూర్ణ హక్కులు పొందారని చెప్పారు. 16 వేల ఎకరాలు 10 వేల మంది రైతులకు ప్రభుత్వం ప్రత్యేక జీఓ ద్వారా న్యాయం చేసిందని తెలిపారు. ఎంతో మహిమాన్వితమైన పుణ్య క్షేత్రం స్థలాన్ని విస్తరించి ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని ఎమ్మెల్యే సింహాద్రి కోరారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుకు సత్వరం, సకాలంలో రుణాలు అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయ గ్రామీణ బ్యాంకులను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. 10 వేల కోట్ల టర్నోవర్‌తో దేశంలో ఐదు బ్యాంకులు గుర్తింపు పొందగా అందులో నాగాయలంక బ్యాంక్ ఉండటం గర్వంగా ఉందన్నారు. జిల్లాలో 970 గ్రామాల్లో రైతులకు అన్ని రకాల రుణాలు తక్కువ వడ్డీకే అందిస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలో ఐదు బ్యాంకులకు గాను కోడూరు, అవనిగడ్డలో శాశ్వత భవనాల్లో బ్యాంకులు పనిచేస్తున్నాయని, మిగిలిన చోట్ల అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయని, వాటి స్థానంలో పూర్తిస్థాయిలో ఆధునిక వసతులతో శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. నాగాయలంకలో ఇప్పటికే స్థలం ఎంపిక చేయగా, చల్లపల్లిలో కూడా స్థల సేకరణ చేస్తున్నామన్నారు. శిథిలమైన భవనాల స్థానంలో జిల్లాలో 15 చోట్ల రూ. 4 కోట్లతో కొత్త భవనాల నిర్మాణం చేపట్టామని చెప్పారు.



వక్కలగడ్డలో గిడ్డంగి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

ఎంపీఎఫ్‌సీ గోడౌన్ నిర్మాణం..

రావివారిపాలెంలో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రావివారిపాలెంలో రూ. 75 లక్షలతో వెయ్యి మెట్రిక్ టన్నులు, వక్కలగడ్డలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోడౌన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తెలిపారు. రైతులు పండించిన ధాన్యం దాచుకుని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు విక్రయించుకునేందుకు ఈ గోడౌన్ రైతులకు ఉపయోగపడుతుందని వివరించారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, జెడ్పీటీసీ ఎం. మల్లికార్జునరావు, బ్యాంక్ డైరెక్టర్ వెంకయ్య, సీఈఓ శ్యామ్ మనోహర్, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, డైరెక్టర్ అరజా లక్ష్మీతులసి, ఏజీఎం సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ కొమ్ము పవన్, మోపిదేవి బ్యాంక్ బీఎం ఎస్. త్రివిక్రమరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి జగన్ కృషి

వక్కలగడ్డ (చల్లపల్లి): రాష్ట్రంలో సహకార వ్యవస్థ బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. సోమవారం చల్లపల్లి మండలం వక్కలగడ్డలో పీఏసీఎస్‌కు అనుసంధానంగా 500 మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తుల గిడ్డంగి నిర్మాణానికి ఎమ్మెల్యే రమేష్‌బాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు అనువైన చేతి సంచులు ఆవిష్కరించి రైతులకు పంపిణీ చేశారు.

బ్యాంక్ సీఈఓ ఎ.శ్యామ్ మనోహర్, బ్యాంక్ డైరెక్టర్ జి.పెదవెంకయ్య, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, ఏఎంసీ చైర్మన్లు వేమూరి వెంకట్రావు, కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు మోతుకూరి ఏడుకొండలు, అబ్దుల్ అర్షద్, చిన కళ్లేపల్లి సర్పంచ్ గుత్తికొండ రాము, కేడీసీసీ బ్యాంక్ చల్లపల్లి మేనేజర్ నగరాజకుమారి, పీఏసీఎస్ చైర్మన్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శిశుగృహను సందర్శించిన జేసీ



శిశుగృహ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ అపరాజితసింగ్

మచిలీపట్నంటౌన్: నగరంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహ, బాలసదనంలను జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ సోమవారం సందర్శించారు. చిన్నారులకు అందుతున్న వసతులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. శిశు గృహ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ భవన నిర్మాణానికి నిధుల విడుదల విషయంపై ఆ శాఖ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శిశు గృహ భవన నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణను ఆదేశించారు. పీడీ సువర్ణ, సూపర్‌వైజర్ మాలతి, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని రహదారి బంగ్లా లేఅవుట్‌ను తహసీల్దార్ రామకృష్ణ, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ సురేంద్ర సోమవారం పరిశీలించారు. ఇక్కడ మొత్తం 52 ప్లాట్లు ఉండగా లెవలింగ్ చేయాల్సి ఉంది. ఈ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు త్వరలో లెవలింగ్ పనులు చేపడతామని చెప్పారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



చెక్కులు అందుకున్న విద్యార్థులతో సంఘ నాయకులు

మచిలీపట్నంటౌన్: ఆదివెలమ శ్రేయోభివర్ధిని మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో పేద విద్యార్థులు ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. 10 వేల విలువ గల చెక్కులను సోమవారం అందజేశారు. బలరామునిపేటలోని సంఘ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖపట్నానికి చెందిన ఇమ్మానేని లక్ష్మీనారాయణ, సావిత్రి దంపతులు ఏర్పాటు చేసిన విద్యా నిధి ద్వారా నాలుగేళ్లుగా మచిలీపట్నం ప్రాంతానికి చెందిన పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందజేస్తున్నామని వివరించారు. సంఘ అధ్యక్షుడు అంకాల సుబ్బారావు, కార్యదర్శి మరకాని వాసు, కోశాధికారి పిల్లారిశెట్టి సత్యనారాయణ, సభ్యులు ఎం. వీరబాబు, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చల్లపల్లి చేరిన అద్దంకి నాంచారమ్మ



చల్లపల్లిలో అమ్మవారికి స్వాగతం పలుకుతున్న భక్తులు

చల్లపల్లి: పెదప్రోలు అద్దంకి నాంచారమ్మ అమ్మవారు సోమవారం సాయంత్రం చల్లపల్లిలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల ప్రారంభం సందర్భంగా అమ్మవారు చల్లపల్లి విచ్చేయగా భక్తులు ఘన స్వాగతం పలికారు. నీరు వారబోసి, అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చాలని భక్తులు వేడుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కూరపాటి కోటేశ్వరరావు స్వగృహం వద్ద అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కృష్ణా యూనివర్సిటీ వద్ద విద్యార్థుల ధర్నా

విద్యార్థులు, పోలీసులకు మధ్య తోపులాట.. ఉద్రిక్తత

కోనేరుసెంటర్: విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపరచాలని, ఇటీవల విద్యుదాఘాతానికి గురై గుంటూరు ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కృష్ణా యూనివర్సిటీ వద్ద ధర్నా నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, హాస్టల్ భవనాలు నిర్మించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ధర్నా చేసిన విద్యార్థులు తిరిగి తరగతులకు వెళ్లిపోగా మరి కొందరు విద్యార్థులు వీసీ వద్దకు వెళ్లి ఇటీవల విద్యుదాఘాతంతో గాయపడిన విద్యార్థులకు యూనివర్సిటీ ద్వారానే వైద్య సేవలు అందించాలని వినతి పత్రం అందజేశారు. వీసీ వద్దకు ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అనుమతించలేదు. దీంతో పోలీసులకు, విద్యార్థి సంఘాల నాయకులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్ అకడమిక్ బ్లాక్ ప్రధాన గేటులో నుంచి లోపలికి వెళ్లాడు. ఒంటిపై దుస్తులు తీసి నిరసన తెలియజేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, పవన్‌కు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో పవన్ ఆర్‌పేట ఎస్ఐ వాసు చొక్కా పట్టుకోవడంతో పోలీసులు అతన్ని నిలువరించారు. ఈ ఘటనలో పవన్ నీరసించడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు చికిత్స నిమిత్తం పవన్‌ను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు యూనివర్సిటీ వద్దకు చేరుకుని విద్యార్థులకు మద్దతుగా ఆందోళనకు దిగారు. పవన్ దుస్తులు ఊడదీసి నిరసన తెలియజేసేందుకు ప్రయత్నించగా నిలువరించామే తప్ప అతనిపై ఎటువంటి చర్యలకు ఉపక్రమించలేదని పోలీసులు చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఇదిలా ఉండగా ఎస్ఐపై దాడికి యత్నించిన పవన్‌తో పాటు మరి కొందరు విద్యార్థి సంఘాల నాయకులపై బందరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని సీఐ రవి కుమార్ తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ఉద్యాన శాఖాధికారులు



తోట్లవల్లూరు లంకలో మిరప పైరును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి చందుజోసఫ్

తోట్లవల్లూరు: మిరప, మినుము పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖాధికారులు తెలిపారు. మిరప పంటలో నల్లతామర పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించామని ఉద్యానశాఖాధికారి చందు జోసఫ్ చెప్పారు. తోట్లవల్లూరు లంకలో ఆయన మిరప పంట పొలాలను సోమవారం పరిశీలించారు. నల్లతామరను గతేడాది నవంబర్‌లోనే గుర్తించి రైతులకు తగిన సూచనలు చేశామన్నారు. నల్లతామరతో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎటువంటి ఆర్థిక నష్టం వాటిల్లదని చెప్పారు. సరైన సస్యరక్షణ చర్యలు పాటించటం ద్వారా పురుగు ఉధృతి తగ్గించి, తగిన దిగుబడులు పొందవచ్చని ఆయన సూచించారు. తల్లి పురుగులు గుడ్డు పెట్టకుండా వేపనూనె 10 వేల పీపీఎం, 0.50 ఎంఎల్ జిగురు, 1 ఎంఎల్ నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అలాగే బవేరియా బస్సియానా, వెర్టిసిల్లీయం లక్కాని అనే జీవశిలీంధ్ర నాశిని 5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారి చేస్తే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. ఎకరానికి 50 గ్రాముల ఫ్రైడ్ లేదా బెనెవియా 250 ఎంఎల్ లేదా రీజెంట్ 50 గ్రాములు లేదా ఇమిడిక్లోప్రిడ్, రీజెంట్ కలిపి 50 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 15 బ్లూస్టిక్ ట్రాప్స్, 15 ఎల్లో స్టికెట్ ట్రాప్స్ అమర్చుకోవటం వలన తామర పురుగు ఉధృతి ఎప్పటికప్పుడు గమనించటానికి అవకాశం ఉంటుందని చందు జోసఫ్ తెలిపారు. రైతులు పడమట హరిప్రసాద్, రావులపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్ప్రేయర్లు అందజేత

మండవల్లి: ఆరు గ్రామాలకు దోమల మందు పిచికారీ స్ప్రేయర్లు అందజేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మల్లీశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొర్లపాడు, అప్పాపురం, చింతలపూడి, మొఖాసాకలవపూడి, పుట్లచెరువు, పసలపూడి గ్రామ పంచాయతీలకు స్ప్రేయర్లు వచ్చాయన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రం అందజేత

బంటుమిల్లి: దివ్యాంగ చిన్నారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండి పలు రకాలుగా ఆదుకుంటాయని ఎంపీపీ వి. చినబాబు అన్నారు. సోమవారం స్థానిక భవిత భవనంలో ఎస్ఎస్ఏ మంజూరు చేసిన వినికిడి యంత్రం, ట్రై సైకిళ్లను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ దివ్యాంగులకు ఇస్తున్న ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ ఎండీ కమాల్‌బాషా, ఫిజియోథెరపిస్ట్ ఎంఎస్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్. మహేష్, భవిత పాఠశాల టీచర్ రాజు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రేపు గూడూరు మండల పరిషత్ సమావేశం

గూడూరు: గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యార్థినులను పరామర్శించిన పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ఈ నెల 10వ తేదీన విద్యుదాఘాతానికి గురై గుంటూరు ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణా యూనివర్సిటీ విద్యార్థినులను సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కిట్టు పరామర్శించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆయన కోరారు. వైద్యపరంగా ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా తనకు ఫోన్ చేసి తెలియజేస్తే అవసరమైన చర్యలు తీసుకుంటానని విద్యార్థినులకు హామీ ఇచ్చారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎస్ఐ రాజేంద్రప్రసాద్



కోడూరు: సమాజంతో పాటు ఆరోగ్యానికి హానికరమైన మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తలపెట్టిన ప్రచారాన్ని సోమవారం ప్రధాన సెంటర్‌లో నిర్వహించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలు హానికరమని, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం వీటిని పూర్తి నిషేధించిందని, నిబంధనలు అతిక్రమించి వీటిని విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ అమ్మకాల సమాచారాన్ని 14500 లేదా 100 నెంబర్లకు కాల్ చేసి తెలియజేయాలని కోరారు. ఏఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన



పెడన: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ప్రాథమిక స్థాయిలో వ్యాధిని నియంత్రించవచ్చని పెడన పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి కె. నిఖిలేష్ అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లెప్రా సొసైటీ స్టేట్ కో–ఆర్డినేటర్ ఎం. రాధిక మాట్లాడుతూ మానవ శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నివారణకు ప్రతి ఆరోగ్య కేంద్రంలోనూ ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. స్కూల్ హెచ్ఎం జయలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో ఏకాగ్రత ముఖ్యం



పెడన: పరీక్షల సమయంలో విద్యార్థులకు ఏకాగ్రత చాలా ముఖ్యమని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీజీ ఆంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 9, 10 తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంచి ఫలితాల సాధన విధానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల టెన్షన్‌ను వీడి ఇష్టంగా చదవాలని చెప్పారు. బలవంతంగా చదువుకోవడం వల్ల ఫలితాలుండవని స్పష్టం చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌బాషా, తాతా సాయిరాం, మట్టా రాధాకృష్ణమూర్తి, రౌతుల ప్రసాద్, కాగిత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉద్యోగుల సంఘ సొసైటీ ఎన్నికలపై స్టే

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పరిషత్ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలపై స్టే ఉత్తర్వులు ఇస్తూ అగ్రికల్చర్, కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీ ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, తుది ఓటర్ల జాబితా సిద్ధం చేయకుండానే నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి ఇచ్చారని, ఓటర్ల జాబితాను సంఘ సభ్యులకు ఇవ్వలేదని, ఇతర శాఖల ఉద్యోగులను సభ్యులుగా చేర్చారని తదితర కారణాలపై కొందరు సొసైటీ సభ్యులు రాష్ట్ర సహకార శాఖా మంత్రి కాకాని గోవర్ధనరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆరోపణలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ప్రిన్సిపల్ కార్యదర్శి స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.